www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 2 డిసెంబర్ 2024 **5** కాకినాడ



నేడు యథావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం



ప్రజాశక్తి - కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు కాకినాడ కలెక్టరేట్‌లో యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. మండల స్థాయిలో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ సోమవారం ఉదయం 9:30 గంటలకు ఆయా మండలాల్లో తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన ఆదేశించారు.

తుపానుతో రైతుల బెంబేలు

- పలుచోట్ల పంటనష్టం
- స్తంభించిన జనజీవనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి, యంత్రాంగం

తుపాను ప్రభావంతో ఆదివారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా వర్షం కురిసింది. ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు సౌకర్యాలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ధాన్యం కోతలు పూర్తయ్యే రోజుల్లో అపార నష్టం తెచ్చిపెట్టింది. ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావం ఎదురైనప్పటికీ కోతల సమయంలో వర్షాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 1.75 లక్షల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 65 శాతం కోతలు పూర్తయ్యాయి. 2.50 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు లక్ష్యం తీసుకోగా 232 రైతు సేవా కేంద్రాలు ఇప్పటి వరకూ 1.60 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు జరిగినట్లు తెలుస్తోంది. కొంత ధాన్యం ఇప్పటికే దళారులు కొనుగోలు చేయగా అత్యధిక భాగం ఇంకా కళ్లాల్లోనే ఉంది. వర్షం నేపథ్యంలో ఆరబెట్టుకొనే సౌకర్యం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద 17 శాతం కంటే ఎక్కువ తేమ ఉంటే కొనుగోలుకు నిబంధనలకు అడ్డుగోడలుగా మారుతున్నాయి. అకాల వర్షాలు, తుపాన్ల సమయంలో పంట ఉత్పత్తులను కాపాడుకునేందుకు రైతులకు టార్పాలిన్లు అత్యవసరం. వరి నూర్పిడి చేసిన తరువాత ధాన్యం ఆరబెట్టే క్రమంలో వర్షాలకు, మంచు వల్ల తడిసిపోకుండా టార్పాలిన్లు వాడతారు. ప్రధానంగా పంట దిగుబడులు చేతికొచ్చే దశలో తుఫాన్లు, వర్షాలు కురిస్తే టార్పాలిన్లుకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. గత ప్రభుత్వాలు 50 శాతం రాయితీపై రైతులకు పంపిణీ చేసేవి. గత 6 సంవత్సరాలుగా పంపిణీ నిలిచిపోయింది. దీంతో బహిరంగ మార్కెట్లో అధిక ధర చెల్లించి కొనుగోలు చేయవలసి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రామచంద్రపురం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. వ్యాపార వర్తక సంస్థలు మూతపడ్డాయి. ఁతో బస్టాండ్‌లు, గోదావరి రేవుల జన సంచారం లేక వెలవెల పోయాయి. తొలకరి వరి పండించిన రైతులు తాము పండించిన ధాన్యం మిల్లులకు పూర్తిగా ఎగుమతి చేయకుండానే తుపాను ఏర్పడడంతో ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఇప్పటివరకు రైతులు ధాన్యాన్ని మిల్లులకు ఎగుమతి చేశారు. మరో 10 మెట్రిక్ టన్నుల ధాన్యం పంట పొలాల్లో ఉండిపోయింది. అయితే దీన్లో 40 శాతం వరకు ఇంకా ఎగుమతి కావాల్సి ఉందని తెలుస్తుంది.

అయినవిల్లి వరి పంటలు పలుచోట్ల దెబ్బతిన్నాయి ఈదురు గాలులకు అక్కడక్కడ వరి చేలు నేల కొరిగాయి.

ఉప్పలగుప్తం ఎడతెరిపి లేని వర్షాలతో గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఎడతెరిపిలేని వర్షాలకు రోడ్లు జలమయంగా మారాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈదురుగాలులతో కురుస్తున్న వర్షానికి చాలా గ్రామాల్లో పంట చేతికొచ్చిన వరిచేలు నేలకొరిగాయి.

తాళ్లరేవు వర్షానికి తోడు ఈదురుగాలులు వీయడంతో పలుచోట్ల పంట పొలాలు నేలకొరిగాయి. మండలంలో 8,254 ఎకరాల్లో వరి సాగు చేయగా 78 శాతం పంట ఒబ్బిడి చేశారని, ఇంకా 22 శాతం మేర మాసూలు కావాల్సి ఉందని వ్యవసాయ అధికారి ప్రశాంతి తెలిపారు.

పెద్దాపురం మండలంలో వరిచేలు 60 శాతం కోతలు పూర్తయ్యాయి. కోసిన వరి చేలు కుప్పలు వేయగా ఇంకా పనల పైన ఉన్న వరి చేల రైతులు పంట నష్టం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. మండల వ్యవసాయ అధికారి కె.సంజయ్ కుమార్ వరి చేలను పరిశీలించారు. మండల పరిధిలో 3,951 హెక్టార్లలో వరి సాగు చేశారని, దీంట్లో 2,400 హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయని తెలిపారు. కొంత పనల్లో ఉందన్నారు. ఇప్పటి వరకు మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా 730 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు.

సామర్లకోట రెండు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా వరి పంట కోతలకు అంతరాయం ఏర్పడింది. ఇప్పటికే మాసూళ్లు పూర్తి చేసుకుని ధాన్యం ఆరబెట్టుకోవడానికి సిద్ధపడుతున్న రైతులకు అకాల వర్షాలు అడ్డుపడ్డాయి. నూర్పిడి చేసిన ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడికి అక్కడే రోడ్ల పై, చేలల్లో ధాన్యం రాశులను ప్లాస్టిక్ తార్పాలిన్ పరదాలతో కప్పి కాపలా కాస్తున్నారు. వర్షానికి తోడు ఈదురుగాలులు వేగంగా వీయడంతో పలుచోట్ల పంట పొలాలు నేలకొరిగాయి. మండల పరిధిలో 60 శాతం వరి పంట కోతలు పూర్తయినట్లు వ్యవసాయ అధికారి ఇమ్మిడిశెట్టి సత్య చెప్పారు.



అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తంలో నేలకొరిగిన వరి చేలు



తాళ్లరేవులో నేలకొరిగిన వరి పంట





ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

రొయ్యల ఫ్యాక్టరీ వద్ద గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి - తొండంగి

మండలంలోని కృష్ణాపురం గ్రామంలో ఉన్న అవంతి రొయ్యల ఫ్యాక్టరీ వద్ద ఆ ప్రాంత వాసులు ఆదివారం ఆందోళనకు దిగారు. ఫ్యాక్టరీ నుంచి విడుదలయ్యే వ్యర్థ జలాల్లో ఉన్న కాలుష్యం కారణంగా ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారంటూ ఫ్యాక్టరీ వద్ద బైఠాయించారు. గ్రామంలో ప్రజలతోపాటు, పశువులు సైతం గర్భకోశ వ్యాధులకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో కంపెనీ ప్రతినిధులు ఆందోళన కారులతో చర్చలు జరిపారు. గ్రామంలో ఫ్యాక్టరీ తరపున మెడికల్ క్యాంపులతో పాటు, సిఎస్ఆర్ నిధులతో చుట్టు పక్కల గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. దీనిపై 20 రోజులు టైం కావాలని కంపెనీ ప్రతినిధులు చెప్పడంతో గ్రామస్తులు తాత్కాలికంగా ఆందోళన విరమించారు.



సుబ్బారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పిఎన్ఎం నాయకులు

సుబ్బారెడ్డి మృతికి పలువురి సంతాపం

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రజా కవి, ప్రజా నాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు గాదే సుబ్బారెడ్డి మృతికి పెద్దాపురం మండల ప్రజానాట్యమండలి ఘనంగా నివాళులర్పించింది. ఆదివారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో ప్రజానాట్య మండలి మం డలి కార్యదర్శి రొంగల వీర్రాజు అధ్యక్షతన జరిగిన సంతాప సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజా నాట్య మండలి నాయకులు దారపురెడ్డి సత్యనారాయణ, మహపాతిన రాంబాబు, దారపురెడ్డి కృష్ణ, చల్లా విశ్వనాథంలు ప్రజా సాంస్కృతిక కళా రంగం అభివృద్ధిలో సుబ్బారెడ్డి చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. అందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆయన ఈ సభలో రొంగల సుబ్బలక్ష్మి, సిరపరపు మరిడియ్య, రొంగల అరుణ్‌కుమార్, అమృత, నమ్రత, గడి గట్ల సత్తిబాబు, సిరపరపు బంగారు రాజు, వివేక్, ధరణి, నీలపాలకృష్ణ, జగదీష్ పాల్గొన్నారు.

'పిడిఎస్ బియ్యం రవాణాలో నా పాత్ర లేదు'

ప్రజాశక్తి - కాకినాడ

రేషన్ బియ్యం అక్రమ రవాణాలో తన పాత్ర ఏమీ లేదని, దానిపై వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని శాన్ మెరైన్ సంస్థ అధినేత అలీషా ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. గత నెల 29వ తేదీ శుక్రవారం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కాకినాడ ఎంకరేజ్ పోర్ట్‌లో రేషన్ బియ్యం అక్రమ రవాణా తనిఖీలో భాగంగా అధికారులతో మాట్లాడుతున్న సందర్భంలో అలీషా ఎవరు అని మాత్రమే అడగడం జరిగిందని, తన గురించి ఎక్కడ తప్పుగా మాట్లాడలేదన్నారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యల్ని వక్రీకరిస్తూ కొన్ని మీడియా సంస్థల తోపాటు, సోషల్ మీడియాలో తనకు రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సంబంధం ఉన్నట్టుగా ప్రచారం చేస్తున్నారని, ఇందులో ఎంత మాత్రం వాస్తవం లేదన్నారు. పోర్టులో బియ్యం ఎగుమతి, దిగుమతికి సంబంధించి లైసెన్స్ కూడా తనకు లేదని, తనకున్న ఏకైక వ్యాపారం నౌకలు తయారీ మాత్రమేనని, రాజకీయాలకు అతీతంగా అందరి సహకారంతో కాకినాడ కేంద్రంగా గత 14 ఏళ్లుగా అంతర్జాతీయ ప్రమాణాలతో నౌకలు తయారు చేస్తూ దేశ విదేశాలకు అందించడం జరుగుతుందన్నారు. మాజీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డికి, తనకు వ్యాపార సంబంధాలు ఉన్నాయని చేస్తున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదన్నారు. కాకినాడ కేంద్రంగా నౌకల తయారీ కేంద్రాన్ని మరింత విస్తరించి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నానని, ఈ సమయంలో తనపై లేనిపోని ఆరోపణ చేయడం తగదన్నారు. త్వరలోనే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని స్వయంగా కలిసి వివరణ ఇస్తానని అలీషా తెలిపారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని కళాశాల వసతి గృహ విద్యార్థులకు అవసరమైన దుప్పట్లను పంపిణీ చేశారు. గత మంగళవారం ప్రజాశక్తి దినపత్రికలో 'వణుకుతున్న సంక్షేమం' కథనంపై డిప్యూటీ సీఎం, నియోజకవర్గ ఎంఎల్ఎ కొణిదెల పవన్‌కళ్యాణ్ స్పందించారు. తక్షణమే వసతి గృహ విద్యార్థులకు అవసరమైన దుప్పట్లను పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే కలెక్టర్ షాన్‌మోహన్ సహకారంతో కాకినాడ డివిజన్ పరిధిలోని అన్ని కళాశాలల వసతి గృహాలకు మొదటిసారి దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందని డిబిసిడబ్ల్యూఒ లల్లీ తెలిపారు. ఇందులో భాగంగా పిఠాపురంలోని కళాశాల వసతి గృహం విద్యార్థినీ, విద్యార్థులకు ఆమె చేతుల మీదుగా దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వసతి గహాల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులకు దుప్పట్లు పంపిణీలో పాల్గొన్న అధికారులు

అవగాహనతోనే ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి నియంత్రణ

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లాలోని పలు కేంద్రాల్లో అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. అవగాహనతోనే ఎయిడ్స్ వ్యాధిని అరికట్టవచ్చునని పలువురు పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ అవగాహనతోనే ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తిని నియంత్రించవచ్చునని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఎయిడ్స్ బాధిత బాల బాలికలతో నిర్వహించిన కార్యక్రమంలో జెసి రాహుల్ మీనాతో కలిపి కలెక్టర్ పాల్గొన్నారు. ఎయిడ్స్ బాధిత బాలికలతో సహపంక్తి బంతి భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు భరోసా నివ్వడం ద్వారా వారిలో ఆత్మ స్థైర్యాన్ని నింపవచ్చన్నారు. ఇందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. ఎయిడ్స్ వ్యాధి నివారణకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని తెలిపారు. ఎయిడ్స్‌పై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని నిరోధించగలమన్నారు. అపోహలు, ఊహాగానాలకు తావు లేకుండా క్రమం తప్పకుండా మందులు వేసుకుని, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆయుర్దాయం పెరుగుతుందని అన్నారు. మన చుట్టూ ఉన్న సమాజాన్ని బలోపేతం చెయ్యాలంటే ఇటువంటి కార్యక్రమాలు స్వచ్ఛందంగా చేపట్టాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన ఉద్యోగస్తులకు, వివిధ స్వచ్ఛంద సంస్థలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ రమేష్, డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎన్.స్వప్న, జిజిహెచ్ ఇన్‌ఛార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్ రావు, ఒఎన్‌జిసి జిఎం సునీల్ కుమార్, రిలయన్స్ సంస్థ డిజిఎం సుబ్రహ్మణ్యం, రెడ్ క్రాస్ సంస్థ ఛైర్మన్ వైడి.రామారావు, సెట్ రాజ్ సిఇఒ కాశీ విశ్వేశ్వరరావు, వివిధ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ విభాగాల వాలంటీర్లు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఐడిఎల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవిని కుమారి ఆదేశాలతో అకాడమిక్ డైరెక్టర్ రంజిత్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.సత్యనారాయణ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.స్టీవెన్‌రాజు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ స్థానిక రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పిఎంపి వైద్యులు కుమార యాదవ్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చెక్క రమేష్, రాజా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం స్థానిక డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీత పాల్గొని మాట్లాడారు. అనంతరం ర్యాలీగా బాలాజీ సెంటర్ వరకూ వచ్చి మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రగడ ప్రయాగమూర్తి, ఆర్ఆర్‌సి కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్‌కె.మదీనా, అధ్యాపకులు డాక్టర్ వి.రామారావు పాల్గొన్నారు.

పెద్దాపురం వైజ్ స్వచ్ఛంద సంస్థ ప్రెసిడెంట్ బి.మల్లేశ్వరి, ప్రాజెక్టు ఆఫీసర్ ఆర్.జయ, ప్రాజెక్టు మేనేజర్ ఎస్.శైలజల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ విజయశేఖర్, ఐసిటిసి కౌన్సిలర్ శ్రీనివాస్, ఎస్ఐ వి.మౌనిక మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నవోదయ ఎన్‌సిసి క్యాడెట్లు, మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ, సెక్రటరీ కుంచే నానిబాబు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గొల్లప్రోలు మండలంలోని తాటిపర్తి ఆరోగ్య వెల్నెస్ సెంటర్ వద్ద ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్ పి.గీత, హెల్త్ అసిస్టెంట్ ఎ.సత్తిబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జగ్గంపేట స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకూ స్వరాజ్య అభ్యుదయ సేవ సమితి స్వచ్ఛంద సంస్థ, రాజపూడి పిహెచ్‌సి సిబ్బంది అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది లక్ష్మీకాంతం, ఆశా వర్కర్లు, స్వరాజ్య అభ్యుదయ సేవ సమితి సత్యనారాయణ, సత్యవతి, శేషరత్నం, శివకృష్ణ, అనిల్, మణికుమారి, మేరీ పాల్గొన్నారు.

తాళ్లరేవు బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన మాట్లాడారు. అలాగే గాడిమొగ పిహెచ్‌సి వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు జయభార్గవి, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యులు డాక్టర్ ఆర్.పవన్‌కుమార్, డాక్టర్ మైకేల్ సౌమ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బుగతా శివ, బొంగులూరి మధుబాబు, కోర్టు సిబ్బంది శ్రీలక్ష్మి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



సహపంక్తి భోజనం చేస్తున్న కలెక్టర్ షాన్ మోహన్



జగ్గంపేటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది




ఏలేశ్వరంలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు



కాకినాడ ఐడిఎల్ కళాశాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

కార్టూ'నిజం'



సాగరంలో వేట.. ప్రాణాలతో ఆట...

-హార్బర్ గట్టు మార్చకుంటే బోట్లకు ప్రమాదం
-మత్స్యకారుల విన్నపాలు గాలికే

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

నిత్యం వేట మీదే జీవనం సాగిస్తున్న మత్స్యకారులు వేటకు వెళ్లి వేట ముగించుకుని నూతనంగా నిర్మిస్తున్న హార్బర్‌కు తిరిగి రావాలంటే ప్రాణాలను ప్రాణంగా పెట్టాల్సి వస్తోంది. నూతనంగా నిర్మించిన మినీ హార్బర్ గట్టును మార్చకపోతే ప్రాణ నష్టంతో పాటు ఆర్థిక నష్టం చోటు చేసుకుంటుంది. ప్రభుత్వాల మారుతున్న మత్స్యకార విన్నపాలు మాత్రం పాలకులు, అధికారులు గాలికి వదిలేస్తున్నారు.

యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ రామన్నపాలెం వద్ద నిర్మిస్తున్న మినీ హార్బర్ కోసం వేసిన ల్యాండింగ్ గట్టు విధానం సక్రమంగా లేకపోవడంతో వేట ముగించుకుని తీరానికి వచ్చే సమయంలో గట్టును ఢీకొంటూ మత్స్యకారుల ప్రాణాలు కోల్పోతున్నారు. గత రెండేళ్ల కాలంలో సుమారు ఐదుగురు మత్స్యకారులు దుర్మరణం చెందారు. వేటకు వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో సముద్రపు అలల వేగానికి హార్బర్‌కు వేసిన రాళ్లను బోట్లు ఢీకొట్టడంతో మత్స్యకారులు ప్రమాదాలకు గురౌతున్నారు. ఉప్పాడ శివారు మాయాపట్నానికి చెందిన బడే రవి, నాయకర్ కాలనీకి చెందిన చింతకాయల పోలీస్, యజ్జల అప్పారావు, తదితర మత్స్యకారుల ఇదే రీతిలో మృతి చెందారని మత్స్యకారులు తెలిపారు. హార్బర్ గట్టుకు వేసిన రాళ్లను ఢీకొట్టుకుని సుమారు 12 బోట్లు ధ్వంసం అయ్యాయని, ఈ ప్రమాదాల్లో లక్షలాది రూపాయల విలువ చేసే వలలు నాశనం అయ్యాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 మంది మత్స్యకారులు ప్రమాదాల భారిన పడి తీవ్రగాయాలపాలయిన సంఘటనలను మత్స్యకారులు గుర్తు చేస్తున్నారు. ఈ రీతిలో జరిగిన ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబానికి పూర్తి స్థాయిలో ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందిన పరిస్థితి లేదని మత్స్యకారులు వాపోతున్నారు. అర్బరు గట్టును మార్చకపోతే మరింత మంది మత్స్యకారుల ప్రాణాలను కోల్పోయే ప్రమాదం లేకపోలేదని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే లేదని మత్స్యకారులు వాపోతున్నారు. 2019లో వైసిపి ప్రభుత్వ పాలనలో ల్యాండింగ్ గట్టును ఇష్టారాజ్యంగా నిర్మించారని, దీంతో ఆర్బర్ గట్టుకు వేసిన రాళ్లను బోట్లు గుద్దుకుంటూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని మత్స్యకారులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని 3 నెలల కిందట కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా రెండు నెలల్లో సమస్యలు పరిష్కరిస్తామని మత్స్యకారులకు హామీ ఇచ్చారు. ఆ హామీ నేటికీ ఆచరణలో అమలుకు నోచుకోలేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుపాను సమయాల్లో అలల తాకిడి ఎక్కువగా ఉండటంతో తీరాన్ని ఆనుకున్న ఉన్న మత్స్యకార గృహాలు ఇప్పటికే వందలాదిగా సముద్ర గర్భంలో కలిసిపోయాయి. నేటికీ కలిసిపోతూనే ఉన్నాయి. ఇంటి స్థలాలు, నిర్మాణాలు చేపట్టాలంటే అందరితోనే నిర్మాణాలు చేపట్టేందుకు నిధులు వస్తున్నాయి తప్ప ప్రత్యేకమైన నిధులు కేటాయించి గృహాలు కోల్పోయిన వారికి యుద్ధ ప్రాతిపదిన స్థలాలు, గృహ నిర్మాణాలకు నిధులు కేటాయించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన మత్స్యకారులను ఆదుకునే దిశగా అడుగులు పడటం లేదనే అభిప్రాయాలను మత్స్యకారులు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మత్స్యకారుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీలు ఇచ్చారు. నేడు డిప్యూటీ సిఎం హోదాలో ఉన్నా పవన్ కళ్యాణ్ మత్స్యకారుల సమస్యలపై దృష్టి సారించకపోవడంపై మత్స్యకారులు తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. మత్స్యకారుల జీవనోపాధిని పెంచేందుకు నిర్మిస్తున్న మినీ ఆర్బర్ వలనే మత్స్యకారుల ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు నష్ట పరిహారం సైతం అందడం లేదని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు.

మత్స్యకారుల ప్రాణాలకు భరోసా కల్పించండి



నూతనంగా నిర్మిస్తున్న మినీ హార్బర్ గట్టును మార్చి మత్స్యకార ప్రాణాలకు భరోసా కల్పించాలి. తీరానికి వచ్చే సమయంలో బోట్లు రాళ్ల కొట్టుకు ఢీకొని మత్స్యకారులు ప్రాణాలు పోతున్నారు. వలలు, ఇతర వస్తువులు ధ్వంసమై ఆర్థికంగా నష్టపోతున్నారు. అలలు తాకిడికి గృహాలు కోల్పోతున్న వారికి స్థలాల కేటాయించిన గృహ రుణాలు అందడం లేదు. కూటమి ప్రభుత్వం తమ సమస్యలపై దృష్టి సారించాలి.

-సూరాడ రాజు, మాజీ వైస్ ఎంపిపి, మత్స్యకారుడు, ఉప్పాడ



హార్బర్ వద్ద ఏర్పాటు చేసిన ల్యాండింగ్ గట్టు(ఇన్‌సెట్‌లో గట్టును ఢీకొన్ని బోటు(ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి
www.prajasakti.com

అందుబాటులో కంప్యూటరీకరణ సేవలు

జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ





ప్రజాశక్తి - అమలాపురం

మరింత మెరుగైన సేవలు అందించేందుకు సహకార సంఘాలను కంప్యూటరీకరణ చేస్తున్నామని జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ తెలిపారు. ఇందులో భాగంగా ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా సహకార సంఘాల్లోని సమాచారాన్ని ఆన్‌లైన్ చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను బలోపేతం చేసే విధంగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. 'ప్రజాశక్తి'తో ఆయన పలు విషయాలను పంచుకున్నారు.

జిల్లాలో ఎన్ని సహకార సంఘాలు ఉన్నాయి, వాటి పరిస్థితి ఎలా ఉంది...

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా 25 డిసిసిబి శాఖల పరిధిలో 166 వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. వీటిలో 107 సొసైటీలు లాభాల్లో, 59 సొసైటీలు నష్టాల్లో ఉన్నాయి. ఈ సొసైటీల్లో రూ.129 కోట్లు డిపాజిట్లుగా ఉన్నాయి. రైతులకు వివిధ రకాల రుణాలుగా రూ.1,514 కోట్లు అందించాం. జిల్లాలో చేనేత సహకార సంఘాలు 19 వరకు ఉన్నాయి.

సహకార సంఘాల కంప్యూటరీకరణ ఎంతవరకు వచ్చింది..

సొసైటీల్లో కంప్యూటరీకరణ పనులు దశల వారీగా జరుగుతున్నాయి. ప్రస్తుతం డేటా ఆన్‌లైన్ ప్రక్రియ చేపడుతున్నాం. అవినీతికి అస్కారం లేకుండా పారదర్శకమైన పాలన అందించేందుకు కంప్యూటరీకరణ ఎంతో దోహదపడుతుంది. జిల్లాలోని అన్ని సొసైటీల్లో త్వరలోనే కంప్యూటరీకరణ ప్రక్రియ పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

పలు సంఘాల్లో అవకతవకలపై వచ్చిన ఫిర్యాదులపై ఏమంటారు...

అల్లవరం డిసిసిబి శాఖ పరిధిలోని ఒక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదు వచ్చింది. దీనిపై ఒక అధికారిని నియమించి నిజనిర్ధారణ చేయాలని ఆదేశించాం. ఆ అధికారి ఇచ్చిన నివేదిక ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటాం. ఏ సొసైటీలోనైనా అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులొస్తే విచారణ చేస్తాం.

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఎంత వరకూ వచ్చింది?

జిల్లాలోని 151 సొసైటీల పరిధిలో ధాన్యం కొనుగోలు ప్రక్రియకు శ్రీకారం చుట్టాం. రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోళ్లు చేస్తున్నాం. ప్రస్తుతం మండపేట, ఆలమూరు, ఆత్రేయపురం మండలాల్లో ధాన్యం కొనుగోళ్లు మొదలయ్యాయి.. మిగిలిన ప్రాంతాల్లో దశల వారీగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం.

సంఘాల ఎన్నికల గురించి ఏమైనా సమాచారం ఉందా...

సహకార ఎన్నికలు నిర్వ హించేందుకు శాఖా పరంగా సిద్ధంగానే ఉన్నాం. ఈ ఏడాది డిసెంబర్ 20 వరకూ గడువు ఉంది. ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తాం.



ఉప సర్పంచ్ జాస్తి వసంత్‌ను సత్కరిస్తున్న చర్చి నిర్వాహకులు

ప్రజల పక్షాన పనిచేసే నాయకుడు వసంత్

ప్రజాశక్తి - గండేపల్లి

కుల, మతాలకు అతీతంగా గ్రామంలో ఏ సమస్య వచ్చిన దాని పరిష్కారానికి పని చేసే నాయకుడు, గ్రామ ఉప సర్పంచ్ జాస్తి వసంత్ అని పాస్టర్ అక్కాబత్తుల శ్యామల్ రాజు అన్నారు. మండలంలోని మురారి గ్రామంలో సెయింట్ పెటర్స్ లూథరన్ చర్చ్‌ని జాస్తి వసంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జాస్తి వసంత్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ గ్రామంలో కులం మతాలకు అతీతంగా ఎవరికి ఏ అవసరం వచ్చినా నేనున్నాను అని ముందుకు వచ్చే నాయకుడు వసంత్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌సి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ దారా యేసురత్నం, సర్పంచ్ కుక్కల ఆనంద్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - దేవరపల్లి

యర్నగూడెం నాగమ్మతల్లి గుడి వద్ద యర్నగూడెం వైపు వస్తున్న కారును పంగిడి గ్రామానికి చెందిన క్వారీ లారీ ఆదివారం ఢీకొట్టింది. ఈ సంఘటనలో అదృష్టవశాత్తూ కారులో ఉన్న నలుగురురికీ పెను ప్రమాదం తప్పి స్వల్ప గాయాలతో బయట పడ్డారు. కామవరపుకోట నుంచి శుభలేఖలు పంచేందుకు కారులో వెళ్తుండగా పంగిడి నుంచి వస్తున్న క్వారీ లారీ గండిచెరువు వాగు డౌన్ వద్దకు వచ్చేప్పటికి వర్షపు చినుకుల కారణంగా అదుపుతప్పి కారును ఢీకొందని స్థానికులు తెలిపారు. దేవరపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చాగల్లు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఊనగట్ల గ్రామానికి చెందిన తొర్లపాటి అచ్చిబాబు (33) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. అదే గ్రామానికి చెందిన తొర్లపాటి కొండయ్యతో కలిసి బైకు పై నిడదవోలు నుంచి ఊనగట్ల వస్తుండగా బ్రాహ్మణగూడెం శివారు వద్ద వ్యాన్ ఢీకొంది. దీంతో ఇద్దరూ గాయపడ్డారు. అచ్చిబాబును మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని సిరివాడ గ్రామంలో ఆదివారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జున్‌రావు తెలిపారు. ఈ దాడులకు సంబంధించి ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ పి.చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

54 మద్యం సీసాలతో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఎక్సైజ్ అధికారులు ఆదివారం నిర్వహించిన దాడుల్లో 50 అక్రమ మద్యం సీసాలతో మండలంలోని కోరంగి పంచాయతీ పెద బొడ్డు వెంకటాయపాలెంకు చెందిన మల్లాడి కామేశ్వరి, జట్లపాలెం గ్రామానికి చెందిన ములగాల ప్రసాద్‌బాబు అనే వ్యక్తి నుంచి 4 అక్రమ మద్యం సీసాలతో అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ కె.కోటేశ్వర్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ నాగేంద్రకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

35 మెట్రిక్ టన్నుల పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - కరప

మండలంలోని నడకుదురు గ్రామంలో 35 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు కరప ఎస్ఐ టి.సునీత తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. ఈనెల 27వ తేదీన ఉదయం 10:30 నిమిషాలకు సివిల్ సప్లై అధికారులు, రెవెన్యూ అధికారులు పోలీస్ శాఖ కలిసి నిర్వహించిన తనిఖీల్లో నడకుదురు గ్రామంలో లావణ్ ఇంటర్నేషనల్ ప్లాంట్ వద్ద ఆగి ఉన్న 7 వాహనాలను తనిఖీ చేసి శాంపిల్స్ తీసుకుని ల్యాబ్‌కి పంపించగా, సదరు లారీలో 35 మెట్రిక్ టన్నుల పిడిఎస్ బియ్యాన్ని గుర్తించి తెలిపారు. తెలంగాణా రాష్ట్రంలోని సిద్దిపేటకు చెందిన శ్రీ మణికంఠ ట్రేడర్స్‌కు లారీని, బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్ఐ టి.సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - గండేపల్లి

యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివనాగు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 30వ తేదీ మధ్యాహ్నం సుమారు 3:00 సమయంలో యల్లమిల్లి గ్రామానికి చెందిన యువతీ తన ఇంటి నుంచి దగ్గర్లోని కిరాణా దుకాణం వద్ద వెళ్లి తిరిగి ఇంటికి రాలేదన్నారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



అధికారులతో సమీక్షిస్తున్న మల్లాడి

కుక్కల బెడద నివారణకు చర్యలు

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గంలో శునకాల బెడదను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. ఆదివారం మల్లాడి స్వగృహంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. సుమారు రూ.35 లక్షల వ్యయంతో కుక్కల వ్యాక్సిన్, వాటి సంరక్షణ, మనుషులకి ఎవరికీ హాని కలగకుండా చూసేందుకు ప్రత్యేకమైన బృందాలతో వాటిని నివారించే దిశగా చర్యలు చేపడతామన్నారు. సుమారు మూడు వేలకు పైగా ఊర కుక్కలు ఉన్నట్లు అధికారులు గుర్తించారన్నారు. ప్రత్యేకమైన షెడ్లు ఏర్పాటు చేసి ఆహారం సైతం అందిస్తామన్నారు. ప్రతి కుక్కకు వ్యాక్సిన్, ఆపరేషన్ చేయడానికి రూ.1000 నుంచి రూ.1500 వరకూ ఖర్చు అవుతుందని, ఇది మున్సిపాలిటీకి పెద్ద భారమేనని అన్నారు. కావున దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆర్ఎఒ మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ కండవల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ఎన్నికల ముందు కూటమి పార్టీలు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఈ నెల 4న విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో జరిగే ప్రజా హక్కుల సభను విజయవంతం చేయాలని పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్ల బొల్లి కబుర్లతో ప్రజాకర్షక పథకాలను ప్రకటించి అధికారంలోకి వచ్చాక వాటి ఊసెత్తకపోవడం దారుణమన్నారు. కూటమి పార్టీలు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజలు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏగుపాటి అర్జున్‌రావు, మానకొండ లచ్చుబాబు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి - సామర్లకోట

క్రీడల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచే వారికి శారీరక మానసిక ఆరోగ్యంతో పాటు ఉత్తమ భవిష్యత్తు ఉంటుందని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో క్రికెట్, కబాడీ బాస్కెట్‌బాల్ క్రీడల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రికెట్ ప్లేయర్ యశ్వంత్ తేజ , కబాడీ ప్లేయర్స్ వర్షిత, అరుణ, బాస్కెట్‌బాల్ ప్లేయర్ కిరణ్‌లను ఫ్రెండ్స్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ నాయకులు ఎండి సైపుల్ల, విప్పర్తి కొండలరావు, గుండు శంకర్రావు, మణిరాజు, శ్రీనివాసరావు, చిట్టిబాబు పాల్గొన్నారు.



క్రీడాకారులను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

సందడిగా 'కొత్తపల్లి' వంశీకుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చెందుర్తి గ్రామంలో ఆదివారం 'కొత్తపల్లి' వంశస్థులు కార్తీక మాసం ముగింపు సందర్భంగా ఆత్మీయ సమ్మేళనంను నిర్వహించారు. అత్యంత పురాతన మండువా లోగిలి ఈ అనుబంధ కలయికకు వేదిక అయింది. అయిదారు తరాలకు ప్రతీకగా నిలిచిన మండువాలో తమ తాత, ముత్తాతలు, తల్లిదండ్రులు..తమ చిన్ననాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడానికి రాష్ట్ర నలుమూలల నుంచి కొత్తపల్లి వంశస్థులు చెందుర్తి తరలి వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ విందూ వినోదాలతో సంతోషంగా గడిపారు. గత కొన్ని సంవత్సరాలుగా తాము ఇలా కలుసుకుంటున్నామని, ఎన్ని పనులున్నా ఇక్కడకు రావడానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని కొత్తపల్లి నరసింహమూర్తి, కొత్తపల్లి సూర్యనారాయణ మూర్తి, కొత్తపల్లి నారాయణ మూర్తి, కొత్తపల్లి కృష్ణమూర్తి, కొత్తపల్లి రమేష్, కొత్తపల్లి సోమసుందర్ అన్నారు. కొత్తపల్లి వంశంలో పెద్దలను సత్కరించి పెద్దల పట్ల తమకున్న విధేయతను చాటుకున్నారు. ఈ కార్యక్రమాన్ని గాడేపల్లి సోమసుందరం పర్యవేక్షించారు.



మూడు తరాలకు చెందిన వంశీకుల మాటా మంతీ

పుట్టిన రోజు వేడుకల్లో రక్తదానం

ప్రజాశక్తి - తాళ్లరేవు

సామాజిక కార్యకర్త, టిడిపి నాయకులు ధూళిపూడి వెంకటరమణ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 70 మంది రక్తదాతలు రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పాల్గొని మాట్లాడారు. రక్తదాతలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పొన్నమండ రామలక్ష్మి, టేకుమూడి లక్ష్మణరావు, కనకాల సిద్ధి శేషారావు, కట్టా త్రిమూర్తులు, అత్తిలి బాబూరావు, ముత్యాల జయలక్ష్మి, ఉంగరాల బూరిబాబు, గంజా సూరిబాబు పాల్గొన్నారు.



వెంటకరమణను అభినందిస్తున్న నాయకులు

ఎంఎల్ఎను కలిసిన ఎపిపి నరేష్‌కుమార్

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూను పెద్దాపురం 7వ జిల్లా కోర్ట్ అసిస్టెంట్ పిపి కందుల నరేష్‌కుమార్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ జ్యోతుల నెహ్రూ ఆశీస్సులతో పెద్దాపురం 7వ జిల్లా కోర్టు ఎపిపిగా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌విఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, వేములకొండ జోగారావు, బుర్రి సత్తిబాబు, ఆనివిళ్ల శాస్త్రి పాల్గొన్నారు.



జ్యోతులకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నరేష్‌కుమార్

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ ఆలయంలో ఆదివారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ కాకినాడ వాస్తవ్యులు నల్లా శివరామకృష్ణ ప్రసాద్, సుదీప్తి దంపతులు, నాగం శ్రీనివాసరావు, వెంకట సత్యవతిలు, పెద్దాపురం పట్టణానికి చెందిన దేవిశెట్టి బాలాజీల సహాయ సహకారాలతో ఈ అన్నదానం నిర్వహించామన్నారు. అన్నదాన కార్యక్రమంలో ఆలయ ఆశాధులు, అర్చకులు, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

11 వరకూ మాధవపట్నం రైల్వే గేటు మూసివేత

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని మాధవపట్నం వద్ద రైల్వే గేటుకు మరమ్మతులు కారణంగా డిసెంబర్ 2 సోమవారం నుంచి 11వ తేదీ వరకూ తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. పరిసర ప్రాంతాల ప్రజలు, ప్రయాణికులు రైల్వే గేటు మూసివేస్తున్న విషయాన్ని గుర్తించాలని కాకినాడ రైల్వే ఎస్ఎస్‌సి ఇంజనీర్ మార్ని రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

వర్తక సంఘం వన సమారాధన

ప్రజాశక్తి - తాళ్లరేవు

సుంకరపాలెం శ్రీలక్ష్మీ గణపతి వరసిద్ధి వినాయక వర్తక సంఘం ఆధ్వర్యంలో నూతన కమిటీ సహకారంతో కార్తీక వన సమారాధన కార్యక్రమం స్థానిక కళ్యాణ మండపంలో ఆదివారం ఘనంగా జరిగింది. ముందుగా వర్తక సంఘం ప్రతినిధులు, తమ కుటుంబ సభ్యులు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. వర్తక సంఘం నూతన అధ్యక్షులు పుగాకు వాసును ఘనంగా సత్కరించారు. వివిధ ఆటల పోటీలలో ప్రతిభ చాటిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.



దీపాలతో మెరిసిపోతున్న భీమేశ్వరాలయం

దీప కాంతుల్లో మెరిసిన భీమేశ్వరాలయం

ప్రజాశక్తి - సామర్లకోట

కార్తీకమాసం ముగింపు పురస్కరించుకుని ఆదివారం రాత్రి భీమేశ్వరాలయం దీప కాంతులతో మెరిసిపోయింది. ఆలయ ఆవరణను కోటి దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.. అంతకుముందు ఆలయ వద్ద ప్రతి ఏటా మాదిరిగా దీపారాధన సంఘం ఆధ్వర్యంలో సుమారు 6000 మందికి అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ బల్ల నీలకంఠం, భీమేశ్వరాలయం ట్రస్ట్ బోర్డ్ మాజీ ఛైర్మన్ కంటే జగదీష్ మోహన్‌బాబు దంపతులు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ గోలి వెంకట అప్పారావు చౌదరి పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సిఐ ఎ.కృష్ణ భగవాన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందిస్తున్న మురళీకృష్ణంరాజు

వైసిపి కార్యకర్తకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని గిరిజన తండా బవురువాక గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త చింతల లోవరాజు మాతృమూర్తి వియోగంతో బాధపడుతున్నాడు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న వైసిపి నాకులు ముదునూరి మురళీకృష్ణంరాజు ఆదివారం పరామర్శించారు. లోవరాజు కుటుంబానికి రూ.5 వేలతోపాటు, 50 కేజీలు బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా నా వంతు సహకారాన్ని అందజేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఏనుగు శ్రీను, సర్పంచ్ లక్ష్మి, నాగేశ్వరరావు, యాళ్ళ ఏసు, మాగాపు శివ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - కాకినాడ

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి భాధ్యత అని ఎపి నేషనల్ గ్రీన్ కోర్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక జగన్నాథపురం ఎంఎస్ఎన్ చారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 'పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర' అనే అంశంపై చిత్రలేఖనం పోటిలను నిర్వహించారు. ఈ పోటిలకు 17 పాఠశాల నుంచి 76 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటిలలో విజేతలకు డిసెంబర్ 3వ తేదిన నిర్వహించు జిల్లా స్థాయి పర్యావరణ సైన్స్ కాంగ్రెస్‌లో బహుమతులు ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, రమణమూర్తి పాల్గొన్నారు.



చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

పంటకాలువలో పూడికతీత పనులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

పలు పంట కాలువలలో పూడిక తీత పనులను పోలేకుర్రు నీటి సంఘం మాజీ అధ్యక్షులు అల్లూరి రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో చేపట్టారు. తాళ్లరేవు డివైడింగ్ డామ్ వద్ద నుంచి నార్త్ ఛానల్, గాడిమొగ ఛానల్‌లో పేరుకుపోయిన పూడికను యంత్రాల సహాయంతో తొలగించారు. సుమారు నాలుగు కిలోమీటర్ల మేరా పేరుకుపోయిన పూడికను గత మూడు రోజులుగా యంత్రాలతో తొలగించినట్లు రామకృష్ణంరాజు తెలిపారు. రబీ సీజన్‌లో రైతాం గానికి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా ఈ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. రామ కృష్ణంరాజు సొంత నిధులతో పూడికతీత పనులు చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.



పూడిక తీత పనులను పర్యవేక్షిస్తున్న రామకృష్ణంరాజు

కుట్టు మిషన్ల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్లను ఆదివారం పంపిణీ చేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ విశ్రాంత జిఎం ఇండుగుల ప్రసాద్‌నాయుడు మాట్లాడుతూ అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వడంతోపాటు, వారికి ఉపాధి కల్పించే లక్ష్యంతో కుట్టు మిషన్లను అందించడం అభినందనీయమని అన్నారు. ట్రస్ట్ అధ్యక్షులు అడబాల రత్నప్రసాద్ మాట్లాడుతూ గత పదేళ్లుగా వివిధ ప్రాంతాలలో ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవిశంకర్ పట్నాయక్, శిరీష, రాజా, శ్రీలక్ష్మి, విజయలక్ష్మి, సత్యనారాయణ పాల్గొన్నారు.



మహిళలకు కుట్టు మిషన్లను అందచేస్తున్న నిర్వాహకులు

పనిచేయని కాన్ఫరెన్స్ ప్రొజెక్టర్

ప్రజాశక్తి - గండేపల్లి

గత మూడు వారాలుగా తహశీల్దార్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ప్రొజెక్టర్ మూలన పడింది. ప్రజా పాలనలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడం సర్వసాధారణంగా మారింది. ప్రజా సమస్యల పరిష్కారానికి మండల స్థాయి నుంచి కలెక్టర్ స్థాయి వరకూ వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించడం పరిపాటి. అయితే మండల తహశీల్దార్ కార్యాలయంలో మాత్రం వీడియో కాన్ఫరెన్స్‌కు వినియోగించే ప్రొజెక్టర్ గత మూడు వారాలుగా పని చేయడం లేదు. దీనికి మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో వీడియో కాన్ఫరెన్స్ కోసం మండల పరిషత్ కార్యాలయానికి తహశీల్దార్ వెళ్లాల్సివస్తుంది. తహశీల్దార్ కార్యాలయంలో ప్రొజెక్టర్‌కు మరమ్మతులు చేయించలేని యంత్రాంగం ఇక ప్రజల సమస్యలను ఏవిధంగా పరిష్కరిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నిర్మాణ దశలోనే శిథిలం

-తరలిపోయిన అంగన్‌వాడీ కార్యాలయాలు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట అర్బన్, రూరల్ ఐసిడిఎస్ కార్యాలయాల కోసం నిర్మాణం చేస్తున్న దశలోనే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. స్థానిక బలిసిలపేట అంబేద్కర్ పార్క్ వెనక మున్సిపల్ స్థలాల్లో ఐసిడిఎస్ అర్బన్ రూరల్ కార్యాలయాల నిర్వహణకు 2014లో రెండు భవనాల నిర్మాణం చేపట్టారు. రూరల్ భవన నిర్మాణానికి రూ.53 లక్షలు, అర్బన్ భవన నిర్మాణానికి రూ.35 లక్షల వ్యయంతో పనులు చేపట్టారు. 60 శాతం పనులు పూర్తయిన బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ ఆ పనులను మధ్యలోనే నిలిపివేశారు. కాంట్రాక్టర్ బిల్లుల తోసం ప్రభుత్వ అధికారుల చుట్టూ తిరిగి మొరపెట్టుకున్న మంజూరు కాకపోవడంతో పనులు ఎక్కడ పనులు అక్కడే ఆగిపోయాయి. గత వైసిపి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను విలీనం చేయడం, కార్యాలయాలను కుదించడంతో సామర్లకోటలో ఉన్న రెండు కార్యాలయాలు పెద్దాపురం, కాకినాడకు తరలిపోయాయి. అప్పటి వరకూ ఐసిడిఎస్ కార్యాలయాలు సామర్లకోటలో అద్దె భవనాల్లోని కొనసాగించారు. దీంతో ఈ భవనాలను పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. పనులు పూర్తి చేసి భవనాలు ఉపయోగం లోనికి తీసుకుని రావాలంటూ అంగన్‌వాడీ సిబ్బంది కోరుతున్నారు. నాడు చేపట్టిన నిర్మాణాలకు అప్పటి హోంమంత్రి, ప్రస్తుత ఎంఎల్ఎ నిమ్మకాయ చినరాజప్ప శ్రీకారం చుట్టారు. కార్యాలయాలు తరలిపోవడంతో ఈ భవనాలపై అధికారులు దృష్టి సారించడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



నిర్మాణం పూర్తికాకుండానే శిథిలమౌతున్న అంగన్‌వాడీ కార్యాలయ భవనం